# దేవుడు

తాటిచెర్ల పరశురామ ప్రసాద

నేను నడుస్తున్నాను -

అని చెప్పటం కంటె నా కాళ్ళు వాటి విధ్యుక్తధర్మాన్ని అవి సక్రమంగా నిర్వహిస్తున్నాయి అని చెప్పటం మేలేమో!

యాంత్రికంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నా మెదడుని కేంద్రంగా చేసికొని నా ఆలోచన సుడులు గిర్రున తిరుగుతున్నాయి

నాలో ఏదో అసంతృప్తి-అశాంతి - ఆందోళన - అనిశ్చిత - అభద్రత. లేనిది ఏదో కావాలనే ఆరాటం - నిజానికి నాకు ఏంకావాలో నాకే స్పష్టంగా తెలీదు.

ఏవో అవ్యక్త ఉద్రేకాలు -
మరేవో అర్థరహిత ఉద్వేగాలు.
ఎందుకు ఈ అస్థిరత ?
నేను బియ్యే పాసయ్యాను.

నా అందం చూచే వరించి మనువాడింది కాత్యాయిని - లక్షాధికారి బిడ్డ పర్యవసానం మాకు ముత్యాల్లాంటి ముగ్గురు బిడ్డలు. అనుకూల దాంపత్యం. అడపాదడపా కథలు రాస్తుంటాను కాబట్టి కొద్దో గొప్పో పేరు ప్రతిష్ఠలు నాకు ఉన్నాయి.

మా ఇంటిలోలాగే ఆఫీసులో కూడా నన్ను చూస్తే అందరికీ భయం ఒక్కోసారి గౌరవం.

నేను ఆఫీసుకి లేటుగా వెళ్ళినా అడిగే నాధుడు లేడు. ఎందుకంటే ఇంటా బయటా నేనే అధికారినే!

మరి ఈ నాగరిక సమాజంలో నాకు ఎందుకింత అసంతృప్తి? నాకు ఏమి లోటు ఉందనీ అసంతృప్తి???

నా ఆలోచనా ప్రవంతికి ఎవరో ఆనకట్టవేసినట్లయింది! నా కాళ్ళు మొండిపిల్లాడిలా రామని మారాంచేశాయి!

కారణం మరేమో కాదు -

నా ఒక కాలి చెప్పు తెగింది.

'ప్రమాదంలో ప్రాణం పోకుండా కళ్ళో కాళ్ళో పోవటమే అదృష్టం' అన్నట్లు -

దూరాన ఓ మర్రినీడ.

దాని చాటున ఎవడో ఒక చెప్పులు కుట్టేవాడు.

దీక్షగా ఏదో కుట్టుకుంటున్నాడు.

—మరో ప్రపంచంలోని మనిషి.

చేసేది ఏమిలేక కాళ్ళీడుస్తూ అక్కడికి బయలుదేరాను.

గోచి తప్ప మరో ఆచ్ఛాదం ఏమీ లేదు నల్లని వాడి శరీరంమీద వయసు అరవై ఐదు దాటి ఉండవచ్చు. అయినా కండలు జారని విగ్రహం. రొమ్ము తుమ్మచెక్కలా ఉంది. కనుబొమ్మలు తెల్లని గొంగళి పురుగులని కళ్ళమీద ఎవరో అతికించినట్లున్నాయి. భృకుటి ఎందుకో ముడిపడిఉంది. తెల్లని గుబురు మీసాలు. పండిన తల వెంట్రుకలు నున్నని బట్టతలకు ఇరుప్రక్కలా అక్కడక్కడా ఉన్నాయి.

దగ్గరలో నా అడుగుల చప్పుడు వినేసరికి ఉలిక్కిపడి నాకేసి చూశాడు తీస్తున్న కూనిరాగం ఏదో టక్కున ఆగిపోయింది. మళ్ళీ క్షణంలో అలవాటు పడ్డ వాడి కళ్ళు నా కాళ్ళమీద పడ్డాయి. నేను వదిలిన చెప్పును ప్రేమగా తన చేతిలోనికి తీసికొన్నాడు వేద ప్రమాణంలా.

"ఏమిత్తారు బాబయ్యా" అడిగాడు దాన్ని రెండు వైపుల త్రిప్పి చూస్తూ. వాడి స్వరంలో ముసలి వొణుకు లేదు.

"ఏమి ఇవ్వమంటావు?"

"పదేను పైసలు యిప్పించండి. సాలు"

"పది పైసలు ఇస్తా. కుట్టు."

"గిట్టదు బాబయ్యా"

"బలవంతం ఏమీ లేదు. ఇష్టం ఉంటే కుట్టు. లేకపోతే వేరే చోట కుట్టించుకుంటాను."

"తమరిట్టం."

పెదవి విరచి ఏదో తాకకూడని వస్తువుని తాకి మైలపడినట్లు వాడు దాన్ని పక్కకి గిరవాటు వేశాడు.

తన పనిలో తాను మళ్ళీ పడ్డాడు. చెట్టంత మనిషిని నేను అనేవాణ్ని ఒక డున్నాడన్న విషయమే తెలియనట్లు వాడు మళ్ళీ నాకేసి ఒక్కసారి అయినా తలెత్తి చూడలేదు.

నాకు ఒళ్ళు మండిపోయింది. మరో చెంప నా వివేకం వాడిని అభినందించకుండా ఉండలేకపోయింది

శ్రమకు తగ్గ ఫలితాన్ని ఆశించి ప్రతి శ్రామికుడు వీడిలా ప్రవర్తిస్తే 'అదనపు శ్రమ' విలువని పెట్టుబడిదరులు ఎలా డబ్బుగా మార్చుకోగలరు?

"సరేలే కుట్టు?" అన్నాను నేను ఓడిపోయినట్టుగా కాకుండా వాడిమీద జాలిపడుతున్నట్లున్న స్వరంతో.

కాని వాడు నా స్వరాన్ని గమనించలేదు. అది వాడికి కాబట్టినట్టు లేదు. కుట్టటానికి నా చెప్పుని తీసుకున్నాడు మళ్ళీ



"నేను రావటం చూసి ఏదో పాడుతున్న పాట ఆపినట్లున్నావ్ ఏమిటది?" వాడితో సంభాషణకి ఉపక్రమించాను.

"భగవంతుడిని పేద్దన సేసికొంటున్నానండి."

"ఎందుకు ప్రార్థన? వాడేమన్నా అరుస్తాడా? తీరుస్తాడా?" నవ్వాను నేను వాడి అమాయకత్వం చూసి

చెప్పులోకి నిడివి సూదివెంట దారం ఎక్కిస్తూ కుడుతున్నవాడు కాస్త నా నవ్వు విని టక్కున ఆపని ఆపి నాకేసి చూసి, "తమ రేమనుకోకపోతే నాదో సిన్న యిసయం మనవిసేసికుంటాను. వోరం యెనకాల నాను పక్క యీదిలో పనిబడి ఎల్లా. అడ ఓ కుక్కకి కొంత రొట్టి యేసినాను. దాని సంగతే మరిసిపోయినా. నిన్న నానటు ఎలుతుంటే ఓ కుక్క నన్నుసూసి తోకాడించి నాకింది బాబయ్యా! అది వోరం నాల్ల కిందట నాను సూసిందే! నిజంగా నాను అది కుతెగ్గత సూపాలని తిండెట్టానా? తమరే సెప్పండి," అన్నాడు.

'ఛెళ్ళ'మని నా వీపుమీద ఎవరో కొరడాతో చరచినట్లు అయింది! ఇంత ఎంగిలిరొట్టి వేసినందుకే హీనమైన కుక్కే అడగకుండానే కృతజ్ఞత

చూపితే ఇంత ఉత్కృష్టమైన మానవ జన్మని ఇచ్చినందుకు భ గ వం తు డు 'డిమాండ్' చేసినా చేయకపోయినా మనల్ని తాను గు ర్తించిడానికి మనకు మనమై కృతజ్ఞత వ్య క్తపరచవలసిన బాధ్యత ఉన్నదా ? లేదా ? అది వాడి ప్రశ్న. దానికి నా దగ్గర సమాధానం లేదు. అందుకే వాడి మాటలని విననట్టు రోడ్డుమీద వాహనాలని గమనిస్తున్నట్టు నటించాను.

"ఏ ఊరు మనది ?" మాట మార్చాను.

"ఈ పెపంచం అంతా మనూరు గాదా బాబయ్యా ? ఏ వూ ర యి నా మనుప్పు మన వొప్పు. రెక్కల కట్టం మీదే తెచ్చుకోవాల." వాడు ఓ నవ్వు నవ్వాడు.

అది వెకిలిగా లేదు. బోలుగా లేదు.

"మీదే కులం ?"

"నాను వోరికి పుట్టినోన్నో నా కెరిక లేదు. నాకు కులం వోచే. నాను మడిసిని. మొగమడిసిని."

ఆశ్చర్యపోయాను :

"తల్లిదండ్రులు లేరా ?"

"ఏనాడో పోయింర్రు పిచ్చోళ్ళు" నవ్వాడు వాడు.

"మరి ఎవరు పెంచారు నిన్ను ?" పిల్లవాడి అమాయకమైన ప్రశ్న విన్న తండ్రిలా నవ్వాడు.

"నారు పోసినోడు నీరు పోయడా ?" నాకు చికాకు వేసింది.

"పెళ్ళికాలేదా ?"

"ఇరవై యేళ్ళ కొడుకుండె."

"వాడేడి ?"

"పోయిండు."

"ఎక్కడికి పోయినాడు ?"

"సనిపోయిండు"

"ఏమైంది ?"

"లారీ మీద్నించి పోయింది. నూకలు పెల్లాయి యెదవకి ఎల్లిపోయిండు."

నవ్వాడు వాడు.

చెక్కు చెదరని నవ్వు. ఆ నవ్వును చూస్తే నాకు ఎందుకు మంట. నా జీవితంలో అది లేనందుకు కాబోలు.

"పాపం ముసలి వయసులో నీకు కష్టం వచ్చింది." సానుభూతి ప్రదర్శించ పోయారు.

కాని అది వాడు చెవికి ఎక్కించు కున్నట్టు లేదు.

"ఏ కట్టై అయినా ఏదో వోనాడు పొయ్యిలో ఎట్టాలె." ని ర్ల క్ష్య ం గా నవ్వాడు వాడు.


ఆ నిర్లక్ష్యం చూసేకొద్దీ నాకెందుకో వాడిమీద కసిపెరిగి ఏడ్పించాలని బుద్ధి పుట్టింది.

"నీ భార్య ఏది ?"

"దూరమైపోయింది"

"ఎవరితోనైనా లేచిపోయిందా ?" నా స్వరంలో కొద్దిపాటి హేళన నిండి ఉంది.

"అవును. నన్నొగ్గేసి ఏడికో వోడి




తోనో ఎల్లిపోయింది." నిర్లిప్తతత తొణికిసలాడుతోంది వాడిగొంతులో.

"పాడు లంజముండ." ముసలివాడి రియాక్షన్‌ని గమనిద్దామని వాడి పెళ్లాన్ని తిట్టాను.

"తిట్టాలిసింది దాన్ని గాదు బాబయ్యా ఆ పేముండేవాడివి."

"లేచిపోయింది నీ పెళ్ళాం. మధ్యలో పాపం వాడిని ఎందుకు నిందించట.?"

ఉండబట్టలేక ప్రశ్నించాను.

"అది వోడినీ వొగ్గేసి నాకాడికి ఎందుకు రావలె? ఆ భగమంతుడు దానికా బుద్ధిపుట్టిచ్చి నాకాడికి పంపిండు. అదే యీరోజు దాన్ని వోరికోసమో పంపిండు. దాని నీల్ల రునం నిదర రునం యేడుందో ఆడుంటది. మద్దెలో ఆపేందుకు నానోడిని? నా నాపిన ఆడు పోయేబుద్ధి పుట్టితే అది నిలుత్తదా? అంతా మన బెమ" వేదాంతిలా నవ్వాడు.

"అది తిరిగివచ్చి నిన్ను క్షమాపణ కోరితే ఏం చేస్తావు." నాకు తెలీకుండానే మరో ప్రశ్న.

"సె మి ం చ డా ని కి నా నోడిని. కూడెడతా. కాని దాన్ని తాకను."

"ఎందుకూ?" కుతూహలం చంపుకోలేకపోయాను.

"అదెల్లిన్నాటి నుంచి బెమ్మచెరం పాటిత్తున్నా."

"ఎన్నేళ్ళయింది అది వెన్నొదలి?"

"సరిగా గుత్తులేదు. మూడు పదులు దాటుతోంది."

ఆశ్చర్యంతో నా తల తిరిగినంత పని అయింది.

"రోగమో రొష్టో వస్తే నీ కి ం త

గంజి కాసిచ్చే దిక్కెవరు?" ఎక్కడో నా మనసు మూలల్లోని ఓ మానత్వ కిరణం బహిర్గతమైంది. నా గొంతు ఆర్ద్రతతో నిండిపోయింది.

"అడవిలో మానుని. నాకు పోదు నీళ్ళుపోసినా పోయకపోయినా బాధ లేదు." నిర్లక్ష్యంగా నవ్వాడు.

దెబ్బతిన్న నా 'అహం' బుసలు కొట్టింది. కాని బుంగలోని పాములా కోపంతో మండిపోయింది తప్ప మరేమీ చేయలేకపోయింది.

"రోజూ ఏమి తింటావు?"

"ఇందాక నాను తమరు సూత్తుండ గానే సహం రొట్టె కుక్కకెట్టానే గదే నాను తినేది."

"సయిస్తుందా?"

"అకలి రుచెరగదు బాబయ్యా!"

ప్రజల అజ్ఞానం చూసి జాలిగా నవ్వే జ్ఞానిలా నవ్వాడు.

"ఈ మానే నా పెపంచం."

అప్పుడు చూశాను చెట్టువెనుక వాడి మరో ప్రపంచం.

వాడు చెప్పు ఎప్పుడో కుట్టాడు నేనే సంభాషణలో పడి గమనించలేదు. అది తొడుక్కొని "నీ పేరేమిటి" ప్రశ్నించాను జేబులో చెయ్యి పెట్టుకొని డబ్బు తీసి వాడికి ఇవ్వబోతూ.

"దేవుడు," నవ్వాడు.

నా చేతిలోకి వచ్చిన పావలాబిళ్ళ వాడి చేతిలో పడేసి వడివడిగా ముందుకు కదిలాను. ఆరడుగులు వేశానో లేదో వెనకనుండి పిలుపు

–"బాబయ్యా!"

ఆ గొంతు నాకు బాగా గుర్తు అది దేవుడిది. కాని ఇందాకటిలాగ అది సౌమ్యంగా లేదు. కొద్దిగా కటువు

"ఏమి?" ఆశ్చర్యపోయాను వాడు అడిగిన దానికంటె పదిపైసలు యింకా ఎక్కువే యిచ్చాను

"నాను కట్టపడేవాడినే గాని బిచ్చగాడిని కాదు బాబయ్యా! తోటి మడిసిగా గుర్తించండి సాలు" అని నేను ఎక్కువగా యిచ్చిన పది పైసల్ని వాపసు కొట్టేసాడు వాడు

నాకు తలకొట్టేసినంత పని అయింది. కాని నేనేమి చేయగలను?

"ఇలా చేస్తే రోజుకి ఎంత వస్తుంది!" అన్నాను అసహనంగా

"ఆడు ఎంతిత్తె అంత వత్తది."

"వాడు ఎంత దయచూపిస్తే నీకు తృప్తి" నాకు లేనిది ఏదో వాడికి ఉందని తెలిసి అక్కసుగా అడిగాను.

వాడు మాత్రం చిద్విలాసంగా నవ్వాడు.

"ఆడ ధరమంటో తమరిల్లిత్తె నా యెదవ మనసు ఆ పెదబాబుగోరి బంగలా కోరుద్ది అదిత్తె ఇంకేదో పెద్దది గోరుద్ది. దానికి బుద్ధిలేదు దానిమాట సెవి కెక్కించుకుంటే యీ జీవితంలో సుక పడలేము"

సర్సరే! రూపాయిస్తా గానీ.. ఆగవయ్యా గుఱ్ఱుడా!!



వాడితో ఇంక వాదించి గెలవలేను. అందుకే అక్కడనుంచి ముందుకి కదిలాను దారి పొడుగునా వాడి ఆలోచనే వాడి దగ్గరికి వెళ్ళేముందు నేనొక మనిషిని వాడి దగ్గరికి వెళ్ళి వచ్చాక మరొక మనిషిని చిత్రం! నాలోని ఏవేవో సంశయాలకి వాడి జీవితమే సమాధానమేమో అనిపించింది ఆలోచించేకొద్దీ.

వాడికి అందం లేదు. చదువు లేదు. నాగరికత లేదు. డబ్బు లేదు. అధికారం లేదు. పేరు లేదు. ప్రతిష్ట లేదు. కాని ఇవన్నీ ఉన్నా చాలామందిలో లేని శాంతి, సుఖం, తృప్తి వాడి జీవితం నిండుగా ఉన్నాయి అవి వాడికి ఎక్కడి నుంచి వచ్చాయి? వాడికి కష్టాలు లేవా?

చిన్నప్పటి నుంచీ వాడిది కష్ట జాతకమే.

తల్లీ లేదు. తండ్రి లేదు.

తెగిన గాలిపటంలాంటి జీవితం.

గాలికి పుట్టి ధూళికి పెరిగాడు.

పెళ్లాం ఎవడితోనో లేచిపోయింది. వాడిని ముసలితనంలో ఆదుకోవలసిన కొడుకు అకాలమరణం చెందాడు. వాడు ఒంటరిగాడు. వాడు ఛస్తే ఒక కన్నీటి బొట్టిను రాల్చేందుకు ఈ విశాల ప్రపంచంలో ఒక్కడూ లేడు! ఏ రోజు రెక్కాడకపోతే ఆ రోజు డొక్కాడదు.

అయినా వాడికి ఎక్కడిది అంత నిశ్చింత?

ప్రపంచమంతా వసుధైక కుటుంబమనే యోచన, స్త్రీ-పురుషులు రెండే జాతులనే భావన, శ్రమకు తగ్గ ఫలితం ఆశించటం–అయాచితంగా లభించే డబ్బు పట్ల తృణీకార భావం; జీవితం ప్రసాదించిన భగవంతుని పట్ల కృతజ్ఞత;

చెట్టంత కొడుకుపోయినా నవ్వే నిర్లక్ష్యం కష్టసుఖాలకు అతీతమై పాపపుణ్యాలు రెండూ పైవాడికే వదిలేసిన స్థితప్రజ్ఞత; అతి కఠినమైన బ్రహ్మచర్యం; రేపటిని గురించి నిర్భయత; ఉన్నచోట బ్రతకటం; దొరికింది తినటం, ఎండకి-చలికి-గాలికి అనాచ్ఛాదితంగా శరీరాన్ని వదిలేసి నిగ్రహం; ఆశకు అంతులేదని గ్రహించి ఉన్నదానితో తృప్తిపడటం; ఇవన్నీ ఎవరు నేర్పారు వాడికి?

మొన్న మా శివాలయంలో ఓ స్వామి గారు అనర్గళంగా గంటసేపు ఉపన్యసించారు. దాని సారాంశం: శౌచం, దానం, వీరం, ధానవం ఇవి దైవ లక్షణాలు. ఇవన్నీ ఆలోచిస్తే వాడిలో లేవా? నాగరికత లేకపోయినా డబ్బుని, స్త్రీని జయించి శుద్ధిని సాధించాడు. తను తినే దానిలో సగం దానంచేస్తూ భూత దయ ప్రదర్శిస్తున్నాడు. జీవితంలో కలిగే ఒడుదుడుకులకు చలించని వీరుడు. జీవితాన్ని ఇచ్చిన దేవుడికోసం తీరిక చేసికొని ధ్యానం చేస్తూనే ఉన్నాడు. ఇవన్నీ వాడికి ఎలా వచ్చాయి? వాడు నాలాగా ఈ ఉపన్యాసం వినలేదు. పెద్ద గ్రంథాలు చదివే పరిజ్ఞానం ఆ స్వామి లాగ వాడికి లేదు. మరి "నీకు ఎలా వచ్చాయిరా" అని మీలో ఏవరైనా వాడిని ప్రశ్నిస్తే తప్పకుండా వాడు "తాటిముంజలోకి నీళ్లు వోరుపోసినారు?" అని మిమ్మల్ని ఎదురు ప్రశ్నిస్తాడు.

ఏది ఏమైన విగ్రహారాధనా మీద విశ్వాసం లేని నాకు దేవుడిని చూడగానే మానవ విగ్రహారాధన మీద నమ్మకం కలిగింది, ప్రబలంగా ఆ ఊరు వదిలి నేను చాల ఏళ్ళు అయిపోయినా—

వయసు తీరిన జారని కండరంలాంటి మనసు, జీవితాన్ని తేలికగా తీసికోవటం వల్ల తృప్తి నిండి, ఏవో తేజస్సుని కురిపించే కాంతికణాల్లాంటి కళ్ళు, ముడిపడ్డ భ్రుకుటిలో గంభీర తాత్త్విక ఆలోచన, తెల్లని గుబురు మీసాల వెనక చెదరని చిరునవ్వు-ఉండే దేవుడి విగ్రహం ఇప్పటికీ నా మనసు కష్టాల్లో కలతబారినప్పుడల్లా సాక్షాత్కరించి నా అంతరాత్మకి, తీయని శాంతిని కలిగిస్తోంది.

